క్లుప్తంగా

సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: మండలంలోని సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కిశోర్‌కుమార్ సూచించారు. సబ్‌సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో బుధవారం పీహెచ్‌సీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



రమాదేవిని పరామర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల మహిళా కన్వీనర్, ఎస్.పి.ఆర్.పురం గ్రామ సర్పంచ్ కంది రమాదేవి ఇటీవల గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం ఆమెను బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. నాయకులు అబోతుల జగన్నాథం, నక్క శశిభూషణనాయుడు ఉన్నారు.

వ్యాపారులు నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై కామేశ్వరరావు

గార: యాసిడ్ వ్యాపారులు తప్పనిసరిగా నియమాలు పాటించాలని స్థానిక ఎస్సై ఎస్.కామేశ్వరరావు అన్నారు. కొనుగోలుదారులకు విధిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. గార పోలీస్‌స్టేషన్‌లో బుధవారం యాసిడ్ వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. యాసిడ్ అవసరమైన వారికే అందివ్వాలని, యువకులకు ఇవ్వకూడదన్నారు. పురుగుమందులను పంటల వినియోగం కోసం రైతులు కొనుగోలు చేస్తున్నట్టు నమ్మకం ఉంటేనే విక్రయించాలన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి పది గంటల తర్వాత అమ్మకాలు నిలిపేయాలని సూచించారు.

ప్రారంభమైన అఖండ పారాయణ




రామాయణ పారాయణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక చేపలవీధిలోని అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక ఆధ్వర్యంలో 72 గంటల సంపూర్ణ రామాయణం సామూహిక పారాయణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు భాస్కరభట్ల శ్రీరామశర్మ మాట్లాడుతూ.. రామాయణ పారాయణలో పాల్గొన్న ప్రముఖుల్లో రెండువందలకుపైగా పారాయణ చేసినవారు ఉన్నారన్నారు. పారాయణ చేసేందుకు పుస్తకాలు, కోశములు అందించినట్టు వివరించారు. హాజరైన ప్రముఖుల్లో ముట్నూరు శ్రీనివాస శాస్త్రి, సవితాల అనంత శ్రీకాంత్, సుందర పవన్ శర్మ, కట్టమూరి చంద్రశేఖర్, అయ్యసోమయాజుల శ్రీరామమూర్తి ఉన్నారన్నారు.

పోతయ్యవలసలో వైద్యసేవలు

లావేరు: ఫ్యామిలీ డాక్టరు విధానంతో ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ అన్నారు. పోతయ్యవలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టరు విధానంలో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎ.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమెన్‌చాందీకి నివాళులు



ఉమెన్‌చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు కారులు

శ్రీకాకుళం అర్బన్: కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ గొప్ప నేత అని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞానభవన్‌లో ఉమెన్ చాందీ చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. డీసీసీ ప్రతినిధులు సనపల అన్నాజీ, పైడి నాగభూషణరావు, అంబటి కృష్ణ, రెల్ల సురేష్ తదితరులు ఉన్నారు.

నిస్సహాయులకు అండ జగనన్న సురక్ష

● రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికార యంత్రాగానికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అర్హులు ఎవరైనా ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోతే జగనన్న సురక్షలో భాగంగా గుర్తించి న్యాయం చేస్తామన్నారు. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగానే అందిస్తున్నామని చెప్పారు. పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో 'జగనన్న సురక్ష'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

గుడివీధికి చెందిన లబ్ధిదారులంతా శిబిరానికి హాజరవ్వగా.. 296 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు తీసుకుని తదనుగుణగా పరిపాలనలో మార్పులు చేసి అందరి సంతోషాలకు కారణమయ్యామన్నారు. దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆంధ్రావని వాకిట జగన్ పాలన ఆదర్శంగా ఇవాళ నిలుస్తోందన్నారు. సమర్థవంతమైన నాయకత్వానికి అండగా మీరంతా నిలబడి గెలిపించడవల్లే పాలనలో అనేక సంస్కరణలు సాధ్యమైనట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో మహిళా సంఘాలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం విపక్ష నేతకు భిన్నంగా ఇచ్చిన హామీ మేరకు మీ అందరి రుణాలనూ నాలుగు విడతలుగా చెల్లిస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఓటు అడిగే ముందే మీ ఎదుట తన మ్యానిఫెస్టోను ఉంచి జగన్ ఎన్నికలకు వెళ్లారన్నారు. ఆ రోజు చెప్పిన విధంగానే ఇప్పటికే 98 శాతం పనులు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. గౌరవంగా పథకాలు అందుకునే పద్ధతిని తీసుకు వచ్చామన్నారు. జన్మ భూమి కమిటీ సభ్యులు హవా సాగించిన రోజులు ముగిశాయన్నారు. సమాజంలో అందరి జీవన ప్రమాణాలు పెరగాలని ముఖ్యమంత్రి నిరంతరం ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలోనే ఆయన వివిధ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆదేశిక సూత్రాలను అనుసరించి పాలన సాగిస్తూ.. పేద, ధనిక వర్గాల మధ్య భేదాభిప్రాయలు లేకుండా చేస్తున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల గడుస్తున్నా సమాజంలో ఇప్పటికీ మిగిలి ఉన్న అసమానతలు తొలగిపోవాలన్నా, జీవన ప్రమాణాలు పెరగాలన్నా మరోసారి జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అందరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇవాళ అవినీతి లేని వ్యవస్థను రూప కల్పన చేశామని, మధ్యవర్తుల ప్రమేయం అన్నది లేకుండా పథకాల వర్తింపు అన్నది సుసాధ్యం చేశామన్నారు. వలంటీరు వ్యవస్థతో అనేక పౌర సేవలను చేరువ చేశామన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ఇంటి చెంతకే పాలన తీసుకొచ్చామన్నారు. జగనన్న సురక్షతో మీ గడప దగ్గరకే 11 రకాల సేవలను మరింత సుసాధ్యం చేశామని పేర్కొన్నారు. వీటి కోసం ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని.. ఇప్పుడా పరిస్థితి లేకుండానే అన్నీ అందుతున్నాయన్నారు. అందుకనుగుణంగా సీఎం జగన్ నిర్ణయాలున్నాయన్నారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. పెద్ద మార్కెట్ రూపు రేఖలను పూర్తిగా మార్చేశామని, రిమ్స్‌లో 900 పడకలు అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి వివరించారు. వీటన్నింటిని చూసి జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. గత పాలనకూ ఇప్పటి పాలనకూ ఉన్న భేదాన్ని గుర్తించాలన్నారు. విపక్షాల మోసపూరిత మాటలకు ఆకర్షితులు కావద్దని.. అన్ని వర్గాల శ్రేయస్సునూ కోరుకునే సీఎం జగన్‌కు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, నాయకులు పిల్లల నీలాద్రి, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, అర్జున్ రెడ్డి, చిన్న బాబు, ఖాన్, భాను ప్రసాద్, అసిరినాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


శ్రీకాకుళం అర్బన్:



మాట్లాడుతున్న గీతాశ్రీకాంత్

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షురాలు డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్ అన్నారు. మహిళల ఆరోగ్యం–పౌష్టికాహారం ప్రాముఖ్యత'అనే అంశంపై శ్రీకాకుళంలోని మహిళా కళాశాలలో అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ముఖ్యమైనది ఆరోగ్యమన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి చురుగ్గా, సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పౌష్టికాహారం, వక్తిగత పరిశుభ్రత చాలా ప్రధానమన్నారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ హర్షవల్లి మాట్లాడుతూ.. హెల్దీ లైఫ్‌స్టైల్ పాటించాలంటే మహిళలు కొన్నింటికీ దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. పౌష్టిక ఆహార లోపం వల్ల యుక్తవయస్సు నుంచే ఊబకాయం, మొటిమలు, పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, యువ టూరిజం కో–ఆర్డినేటర్ వరలక్ష్మి, డీటీవో నారాయణరావు, జేసీఐ దూసి సంతోష్, శంకర్ నారాయణ, కృష్ణారావు, బరాటం శ్రీనివాస్, మురళి మోహన్, బ్రహ్మాజీ, పద్మావతి, ఆదిలక్ష్మి, శాంతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి: తాజా వర్షాలకు నగరంలోని పి.ఎన్.కాలనీలో మంగళవారం అర్ధరాత్రి భారీ వృక్షం కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. దీంతో పీఎన్ కాలనీ– 4వ లైనులో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సంబంధిత ఇంజినీర్లు స్పందించి యుద్ధ ప్రాతిపదికన బుధవారం వేకువజాము నుంచే మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునఃరుద్ధరించారు. డీప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు ఆధ్వర్యంలో డి–2 ఏఈ సురేష్‌కుమార్ సమక్షంలో కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు పనులను పూర్తి చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

లావేరు: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చొరవతో మండలంలోని వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం చేపట్టారు. గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్య ఉంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు భూరాడ చిన్నారావు, వెంకటాపురం పంచాయతీ సర్పంచ్ ఎల్లం నాయుడు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రోడ్డు సమస్య పరిష్కరిస్తుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ నాయకులు పిన్నింటి సూర్యారావు, వావిళ్ల తమ్మినాయుడు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్లలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను బుధవారం చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను, కాలువల్లో పూడికలను తొలగించారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్‌చల్లారు. పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు.

సీఎం జగన్ చిత్రపటానికి ఆర్టీసీ ఉద్యోగుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీఎం శర్మ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ఉద్యోగులుగా మార్చిన దేవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.శర్మ అన్నారు. హయ్యర్‌పెన్షన్ పెంపును హర్షిస్తూ రెండో డిపో గ్యారేజీ ఆవరణలో సీఎం జగన్ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆర్టీసీని ప్రభుత్వపరం చేయడం సాహసోపేత నిర్ణయమన్నారు. అటువంటి నిర్ణయం తీసుకుని రాష్ట్రంలోని 52 వేల మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో డిపో ఎంఎఫ్ బి.చాణుక్య, హెచ్‌సీ ఉమామహేశ్వరరావు, అకౌంటెంట్ సూర్యారావు, ఎల్.ఎస్.నాయుడు, వి.శాంతరాజు, ఆర్.వి.రావు, నవీన్, రమణ, రామకృష్ణ, సిమ్మయ్య పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ధనుంజయరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రమణమూర్తి

రణస్థలం: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ రణస్థలం, లావేరు సమితి యూనియన్ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి జి.వి.రమణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీనిధి భవనంలో బుధవారం ఎన్నికల ప్రక్రియ జరిగిందన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రణస్థలం, లావేరు పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సమితి అసోసియేషన్ అధ్యక్షుడుగా రణస్థలం ఎంపీడీవో కార్యాలయ ఏవో వి.ధనుంజయరావు, ఉపాధ్యక్షులుగా ఎం.సునీత, కోశాధికారిగా ఐ.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్–1గా ఎస్.రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.ఎం.కె.పట్నాయక్ ప్రత్యర్థిపై ఎనిమిది ఓట్ల తేడాతో, జిల్లా కౌన్సిలర్–2గా జి. శ్రీరాములనాయుడు ప్రత్యర్థిపై నాలుగు ఓట్ల తేడాతో గెలుపొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ధనుంజయరావు మాట్లాడుతూ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాంలు నూతన కార్యవర్గాన్ని అభినంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, మింది శ్రీను ఉన్నారు.

ప్రభుత్వ సేవలు దేశానికే తలమానికం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దమ్మలవీధిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు



లావేరు: తామాడలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



రణస్థలం: కొచ్చెర్లలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సాయికుమార్



గార: కొర్నిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రఘురామ్, అధికారులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న నేతలు దీని ప్రాముఖ్యతను వివరించారు. 11 సేవలను ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్య సమాజానికి ఉపయోగపడాలి

● బీఆర్ఏయూ వీసీ వెంకటరావు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్య సమాజానికి ఉపయోగపడాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పరిధిలోని ఎఫిలియేషన్ కళాశాలల బోర్డాఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సమన్వయకర్తలకు 'నేర్చుకోవటంలో మెరుగైన పద్ధతులు'అనే అంశంపై వర్సిటీలో ఒకరోజు శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. బీఆర్ఏయూ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, బీసీడీఈ, యునిసెఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. విద్యలో సేవ అవసరంగా చెప్పారు. విద్యార్థులు సమాజాన్ని చదవాలని, సమాజం నుంచి మంచిని నేర్చుకోవాలన్నారు. డిగ్రీలు సమాజానికి ఉపయోగపడడంతోపాటు ఉపాధికి దోహదపడాలన్నారు. గతంలో ఉన్నత విద్య కొందరికే పరిమితమయ్యేదన్నారు. అయితే ప్రస్తుతం విస్తరించటంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో అందరికీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యకు పేదరికం అడ్డులేకుండా ప్రభుత్వం ఉచిత విద్యను అర్హులకు చేరువ చేస్తోందన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం పేదలకు చేరువైందన్నారు. విద్యార్థిపై కుటుంబం, పరిసరాలు, ఉపాధ్యాయుని ప్రభావం ఉంటుందన్నారు. ప్రతి ప్రభావం అనుకూలంగా ఉంటే విద్యార్థులు నైపుణ్యం ఉన్న ఉత్తమ మానవవనరులుగా ఎదుగుతారని వివరించారు. ప్రాథమిక విద్యలో కూడా గతంలోకంటే అనేక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు, అమ్మఒడి, విదేశీ విద్య, మధ్యాహ్న భోజన పథకాలతో విద్యార్థులు విద్యకు చేరువయ్యారన్నారు. ఇంట్లో కంటే పాఠశాలలోనే ఎక్కువగా ఉండేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. డిగ్రీలో ప్రవేశ పెట్టిన సామాజిక అనుసంధానం కార్యక్రమాల వల్ల సమాజాన్ని నేరుగా చూస్తున్న విద్యార్థులు కొత్త అంశాలు తెలుసుకుంటున్నారన్నారు. రాష్ట్ర బీసీడీఈ సీఈవో, కార్యదర్శి ఎం.ఎల్.ఎస్. దేవకుమార్ మాట్లాడుతూ.. సామాజిక అనుసంధాన క్యార్యక్రమాలు ఉన్నత విద్యలో అమలు చేయడం వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. కళాశాలలు ప్రతిష్టాత్మకంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ. రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్‌రావు, యునెసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్స్ మేనేజర్ ఆర్.అప్పారావు, వర్సిటీ బీసీడీఈ అధికారి బి.అజయ్‌కుమార్, జిల్లా ఎన్ఎస్ఎస్ పీవో ఎం.అనురాధ, యోగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కంచరాపు తారక రామారావు పాల్గొన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి

● సీత డైరెక్టర్ రామచంద్రరావు



మాట్లాడుతున్న శంకరశర్మ, పక్కనే డైరెక్టర్ రామచంద్రరావు

అరసవల్లి: దేవాలయాల్లో ప్రథమ సేవకుల్లా పాలకమండలి సభ్యులు, చైర్మన్లు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ (సీత) డైరెక్టర్ రామచంద్రరావు సూచించారు. అరసవల్లి ఆలయంలో సీత ఆధ్వర్యంలో ఆలయ పాలకమండలి సభ్యులు, చైర్మన్లకు బుధవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పలు అంశాలను చర్చించారు. పాలకమండలి సభ్యులంతా ఆయా ఆలయాల కార్య నిర్వహణాధికారులతో సత్సంబంధాలను కొనసాగించాలని కోరారు. అరసవల్లితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చాలా ఆలయాల్లో పాలకమండలి సభ్యులు తమ సొంత నిధులతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని..ఇది ఎంతో విశేషమన్నారు. అరసవల్లి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ.. ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆధ్యాత్మికంగా నియమ నిబంధనలను పాటించాలన్నారు. అలాగే ఆయా ఆలయాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడంతో మంచి పరిణామాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, రిటైర్డ్ అధికారి టి.పి.ఎస్.మూర్తి, అరసవల్లి ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనూరాధ, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, ఉకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫైలేరియాపై అప్రమత్తం



మందుల కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యారోగ్య శాఖాధికారులు

లావేరు: ఫైలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యాశాఖాధికారి డాక్టరు బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ అన్నారు. అదపాకలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న 50 మందికి మార్బిడిటీ మానేజ్మెంట్ కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె శశికళ, మాజీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, మురపాక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు పి.సౌమ్య, పీహెచ్ఎన్, ఎస్.వి.రమణమ్మ, ఈవో తిరుమలరావు, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్‌సుందర్, ఏఎన్ఎం సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, అసిస్టెంట్ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు, కన్సల్టెంట్ ఎల్.శ్రీకాంత్, పొందూరు సబ్ యూనిట్ అధికారి టి.సురేష్, ఫైలేరియా హెల్త్ అసిస్టెంట్లు బి.మురళీ, టి.సాయికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పర్యాటక ప్రదేశాలపై విస్తృత ప్రచారం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి యువక్లబ్‌లు దోహదపడతాయని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో యువక్లబ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాల విశిష్టతను వివరించారు. పర్యాటకాభివృద్ధి కమిటీ సభ్యురాలు గీతా శ్రీకాంత్, హెచ్ఎం ఎం.వాగ్దేవి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

శ్రీకాకుళం అర్బన్: ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు వచ్చిన గురుగుబెల్లి హరీష్ అనే ప్రయాణికుడు తన సెల్‌ఫోన్‌ను కాంప్లెక్స్‌లో పోగొట్టుకున్నాడు. కొంతసేపటి తర్వాత ఫోన్ లేదన్న విషయాన్ని గుర్తించి కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. ఇంతలో ఆ సెల్‌ఫోన్ కాంప్లెక్స్‌లో స్వీపర్‌కు దొరకగా ఎస్ఎం నరేంద్రకు అప్పగించారు. హరీష్ ఆ ఫోన్ తనదేనని ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపు వివరాలు చెప్పగా ఫోన్ అందజేశారు. ఆర్టీసీ ఓపీఆర్ ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా ఉన్నారు.

బోధన పద్ధతుల్లో మార్పు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్య సుస్థిరాభివృద్ధి కోసం బోధన పద్ధతుల్లో మార్పు అవసరమని టెక్నోహబ్ వీబీటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు నికోడమస్ అబ్రహిం సునీల్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెమినార్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. ఆవిష్కరణలు, పరిశోధనలకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు టెక్నికల్ సెషన్స్, సాంకేతిక అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ నీలం సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

జి.సిగడాం: చంద్రయ్యపేట యూపీ పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు మక్క గంగేశ్వరి, ఉరిటి సతీష్ పట్నాయక్, పందరికోటేశ్వరరావు, కుప్పిలి పద్మావతి బదిలీపై వేరే పాఠశాలలకు ఇటీవల వెళ్లారు. వీరిని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లా లక్ష్మీభవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లా జనార్దనరావు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు బస్వా రమేష్, ఉపాధ్యాయులు పేకల రమేష్, వల్లూరు రమణ, లింగరాజు, దామోదరావు, నాయకులు గోవిందరావు, కర్రి జ్యోతి ఉన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వే

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో సమగ్ర శిక్షా అధికారులు ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వేను బుధవారం నిర్వహించారు. అధికారులు గోవిందరావు, అనురాధతో కూడిన బృందం ఇంటింట సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా ఒక విద్యార్థిని గుర్తించి.. పాఠశాలకు పంపించాలని సిబ్బందికి సూచించారు.

మందిరం నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న శ్రీకృష్ణ సంఘం సభ్యులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి స్థలం చూపించాలని పెదపాడు శ్రీకృష్ణ సంఘ సభ్యులు కోరారు. పెదపాడులోని గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ భ్యులు బాగు దశరథ, పాని జగదీష్, బొడ్డ చిరంజీవి, బొడ్డ మురళీ, బొడ్డ దేవానంద్, కలగ పాపారావు మాట్లాడారు. 1990లో యాదవ సంఘం సభ్యులు గొర్లె సత్యనారాయణ, కిల్లాని జానకీరామయ్య, కలగ అప్పలస్వామి, బాగు దాలయ్యలు పెదపాడులో కృష్ణ మందిర నిర్మాణానికి తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ భూ సర్వేలో భాగంగా పెదపాడులోని పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతంలో శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి 11 సెంట్లు అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసిందన్న విషయం సర్వేలో బయట పడినట్లు వెల్లడించారు. కాలక్రమేణా ఆ స్థలాన్ని టిక్కెర్ ఫిల్లింగ్ స్టేషన్‌కు చెందిన తంగుడు హరికృష్ణ, నాగరాజు, శ్యామ్ సుందర్‌లు కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు, మండల సర్వేయర్లుకు ఫిర్యాదులు చేశామన్నారు. జిల్లా యంత్రాంగం చొరవ చూపించి మందిర నిర్మాణానికి ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు.

భాషా అధికార సంస్థ ప్రాజెక్టుకు ఎంపిక

శ్రీకాకుళం కల్చరల్: గాయత్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న భమిడిపాటి గౌరీశంకర్ మైసూర్ భాషా అధికార సంస్థ వారి ప్రాజెక్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 'కళింగాంధ్రా దేవాలయాలు.. తెలుగు శాసనాలు' అనే అంశంపై పనిచేయవలసి ఉంటుందన్నారు. నివేదికను మైసూర్‌లోని సీఐఐఎల్ వారికి అందించాల్సి ఉంటుందన్నారు. ఈసందర్భంగా గౌరీశంకర్‌ను గాయత్రీ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు సత్కరించారు.